

పార్టీలో చేరిన వారితో మంత్రి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్

# బీఆర్‌ఎస్ విజయం ఖాయం

**మంత్రి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

బేగంపేట్, నవంబర్ 25: రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి, సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో 15 మంది కాంగ్రెస్ నాయకులు తలసాని సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలని కోరుకుంటున్నారని తెలిపారు. అది కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని గుర్తించారని చెప్పారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపించామన్నారు. అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో వీరేందర్ గౌడ్, రాహుల్ యాదవ్, లక్ష్మణ్ ఉన్నారు.


# గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

- నీరా కేఫ్ పెట్టి గౌడ కులస్తులకు గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- గౌడ కులస్తుల ఆత్మీయ సభలో మంత్రి చామకూర మల్లారెడ్డి



రాంపల్లిలో గౌడ కులస్తుల ఆత్మీయ సభలో మాట్లాడుతున్న మంత్రి, మేడ్చల్ అభ్యర్థి మల్లారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 25: రాష్ట్రంలో నీరా కేఫ్ పెట్టి గౌడ కులస్తులకు గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో శనివారం నిర్వహించిన గౌడల ఆత్మీయ సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో కల్లు దుకాణాలను మూసివేశారని, సీఎం కేసీఆర్ వచ్చిన తరువాత గౌడ కులస్తులకు గుర్తింపు వచ్చిందన్నారు. రాంపల్లిలో ఉన్న 5 ఎకరాల ఈత, తాటి వనాల్లో గౌడ కులస్తులకు హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీమా, అర్హులైన వారికి పింఛన్లు అందజేస్తామన్నారు. గౌడ కులస్తులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, కులవృత్తులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయూతనిస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వాలు కుల వృత్తులను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఎన్నికలు అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు, రైతులను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్‌కు మధ్య జరుగుతున్నాయన్నారు. అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని మంత్రి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, జిల్లా రైతుబంధు సమితి డైరెక్టర్ అంజయ్యగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ నాగేశ్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు అశోక్ గౌడ్, రాంపల్లి రైతుబంధు సమితి అధ్యక్షుడు పెంటయ్యగౌడ్, గౌడ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, నాయకులు సందీప్, దేవేందర్, వినోద్, శ్రీశైలం గౌడ్, మహిళలు పాల్గొన్నారు. కాగా పోచారం మున్సిపాలిటీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనాల్లో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు.సంక్షేమం, అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్‌నే గెలిపించాలన్నారు.




# సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

**పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంఆర్‌పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి**



సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మారావుగౌడ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

సికింద్రాబాద్, నవంబర్ 25: ఎన్నికల వేళ గులాబీ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావిస్తున్న వివిధ పార్టీల నేతలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా పార్టీలను ఒక్కొక్కరుగా వీడుతున్నారు. ఈ క్రమంలోనే ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నందారం సీతారాం శనివారం టకరా బస్తీలో డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మారావుగౌడ్ సమక్షంలో దాదాపు 300 మందితో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విజన్ ఉన్న నేత అని, ఆయన పాలనలోనే బంగారు తెలంగాణ సాకారం అవుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ఇతర పార్టీల నేతల ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రజానీకం బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతుంటే, కాంగ్రెస్, బీజేపీలకు ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మారావు తనయుడు రామేశ్వర్‌గౌడ్‌తో పాటు లత, మహేశ్వర్, సరళ, మేఘన, సిద్ధార్థ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్, బీజేపీల హామీలు బోగస్

**జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్‌లో ఉద్యమకారులతో కలిసి ప్రచారం చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


బంజారాహిల్స్, నవంబర్ 25: కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మడం లేదని, ఆ పార్టీల హామీలు అంతా బోగస్ అని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి విజయం సాధించడం ఖాయమన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఎన్‌బీటీనగర్‌లో బీఆర్‌ఎస్ ఉద్యమకారులతో కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో దానం నాగేందర్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్ సిలిండర్, రూ.15లక్షల ఆరోగ్య బీమా, రూ.5లక్షల జీవిత బీమాతో పాటు రేషన్‌పై సన్నబియ్యం పంపిణీ తదితర పథకాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, ఉద్యమకారులు రాంచందర్, నర్సింహ, రఘు ముదిరాజ్, విజయ్, శంకర్, ఆంజనేయులు, సారంగపాణి, ఉమ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శనివారం శ్రీనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు – వెంగళరావు నగర్

# అపర్ణహిల్ పార్కు ఫెడరేషన్ మద్దతు బీఆర్‌ఎస్‌కే

కొండాపూర్, నవంబర్ 25 : అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న అరెకపూడి గాంధీకి తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని చందానగర్ డివిజన్ పరిధిలోని అపర్ణహిల్ పార్కు ఫెడరేషన్ కాలనీ వాసులు పేర్కొన్నారు. శనివారం అపర్ణహిల్ పార్కు ఫెడరేషన్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న గాంధీని మరోసారి గెలిపించుకునేందుకు వారంతా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందన్నారు. తొమ్మిదేండ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, భవిష్యత్తులో కొనసాగించేందుకు కృషి చేస్తామన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అపర్ణహిల్ పార్కు ఫెడరేషన్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి అభ్యర్థి గాంధీ